"బాబు చేసిన నష్టాల్ని, మీ తెలివితేటలతో లాభాలుగా మారుస్తున్నారు. ఇవ్వాళ లక్షలయ్యాయి- రేపు కోట్లు కావచ్చు- గొయ్యి పెద్దది కాకముందే కప్పిపెట్టాలని మీలాంటి పెద్దలు చెప్పారు. అందుచేత ముందుగా మీకు చెప్పటం నా బాధ్యత అని చెబుతున్నాను సార్- పది రోజుల క్రితం ఆ బార్‌ని కొనిపించటానికి కారణం మహతి. యూనివర్శిటీ ఆడిటోరియంలో విగ్రహాల ధ్వంసానికి కారణం ఆ మహతి. సిటిజన్స్ క్లబ్‌లో జరిగిన గొడవకు కారణం ఆ మహతి- ఆ అమ్మాయి బాబుని సైడ్‌ట్రాక్ పట్టిస్తోందని నా అనుమానం- ఇదిలాగే కొనసాగితే మీ ప్రెస్టేజ్‌కి దెబ్బ" చెప్పటం ఆపాడు రవికిరణ్.

రివాల్వింగ్ చైర్లో వెనక్కి జారగిలబడి  ఆలోచిస్తున్న రాఘవేంద్ర నాయుడు రవికిరణ్ వేపు చూసి--

"ఆ అమ్మాయి వాంటెడ్‌గా మనవాడ్ని ఫూల్‌ని చేస్తుందనా నీ అభిప్రాయం?"

"ఎగ్జాట్లీ సార్ ..... "

"దానివల్ల ఉపయోగం?"

రవికిరణ్ సమాధానం చెప్పలేకపోయాడు.

" రవికిరణ్ ..... వాడు మిస్‌గైడ్ కాకూడదు. రేపటి ఈ కోట్ల ఆస్తికి వారసుడు వాడు. వాడిమీద నాకెన్నో ఆశలున్నాయి. వాళ్ళిద్దరి మధ్యా ఉన్న క్లాష్‌ని గమనిస్తుంటే, ఇదేదో సీరియస్ ఎఫైర్‌గా మారే ప్రమాదం వుందని నాకనిపిస్తోంది. అందుచేత ఇది ముదరకముందే కట్ చెయ్యడం మంచిది. బాబు జోలికి రావద్దని వార్నింగిద్దామా?"

ఓ కొడుక్కి తండ్రిలా మాట్లాడాడు రాఘవేంద్ర నాయుడు. ముందు తన కొడుకు కట్టుబట్టలతో నడిరోడ్డు మీదకు వెళ్ళి నిలబడే ప్రయత్నం చేస్తానన్నప్పుడు, నిజమైన జీవితం అంటే ఏమిటో అనుభవంలో కొచ్చి బాగుపడతాడనుకొని సంతోషించాడు. కాని ..... ఎడబాటునే ఊహించలేక మనస్సు మార్చుకున్నాడు.

"నో సార్ వద్దు. ఈ వయసులో పిల్లలకి వార్నింగిస్తే ప్రమాదం. ఏది చెయ్యకూడదంటామో అదే చేస్తారు."

అయిదు నిమిషాలసేపు రాఘవేంద్ర నాయుడు ఏం మాట్లాడలేదు. ఆయన బ్రైన్ ఓ కంప్యూటర్ చెస్ బోర్డు లాంటిది.

ఎత్తులూ, పై ఎత్తులూ, పడగొట్టడాలు, పక్కకు జరపడాలూ అన్నీ ఆటోమెటిగ్గా జరిగిపోతుంటాయి.

మహతి ఆడుతున్నది ఓ ఇంటెలిజెంట్ గేమ్ అని అన్పిస్తుందాయనకు. అయితే ఆ గేమ్ ఎందుకు?

"మిస్టర్ రవికిరణ్ ! ఐ వాంట్ టు సీ హెర్. అవును ..... ! ఆ మహతిని నేను చూడాలి. నేనా అమ్మాయితో మాట్లాడాలి."

రాఘవేంద్ర నాయుడు నోటినుంచి వచ్చిన ఆ మాటకు ఆశ్చర్యపోయాడు రవికిరణ్ . టైమ్ వాల్యూ తెల్సిన రాఘవేంద్ర నాయుడు బిజీ షెడ్యూల్‌లో ఒక్కొక్క సెకండ్ విలువ ఒక్కో లక్ష రూపాయలు. ఆయనెప్పుడూ టైం వేస్ట్ చేయరు.

జీవితమనే కరెన్సీ కాగితమ్మీది వాటర్ మార్క్ లాంటిది టైమ్ అంటాడాయన. వాటర్ మార్క్ లేకపోతే ఆ రూపాయి కాగితానికి విలువ లేదు. ఆయన ఇంటర్వ్యూ కోసం ఎంతోమంది ప్రముఖులు వెయిట్ చేస్తుంటారు. అయినా ఆయన పర్సనల్‌గా మాట్లాడేది, అతి ముఖ్యమైన సందర్భాల్లో మాత్రమే.

కానీ-- ఆయన మటుకు ఆయన-- ఆఫ్ట్రాల్ ఒక ఆడపిల్లతో మాట్లాడాలంటున్నాడంటే .....

"మీరా అమ్మాయితో మాట్లాడుతారా?" పరమాశ్చర్యంగా అడిగాడు పి.ఏ.

"నేనా మాట అనగానే నువ్వాశ్చర్యపోయావ్! అవునా? దీనిని బట్టి ఆ అమ్మాయి స్పెషాలిటీ నీకర్థమయ్యే వుంటుంది. అందుకే ఆ అమ్మాయితో నేను

మాట్లాడాలనుకుంటున్నాను. ఎక్కడ? ఎలా నువ్వే డిసైడ్ చెయ్యి" చెప్పి తన పనిలో మునిగిపోయాడు రాఘవేంద్ర నాయుడు .

* * * *

అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు .....

కాలింగ్ బెల్ మోతకు మహతే స్వయంగా వచ్చి తలుపు తీసింది. ఎదురుగా ఇద్దరు అపరిచిత వ్యక్తులు!

"మహతి నువ్వేనా?" గంభీరమైన ఆ గొంతులోంచి వచ్చిన మాటకు--

అవునన్నట్టు తలూపింది మహతి.

" మధుకర్ తండ్రిగారు పంపారు. అయిదు నిముషాలు నీతో మాట్లాడాలమ్మా!"

"నాతోనా!" ఆశ్చర్యపోతూ "రండి" అంటూ లోనికాహ్వానించింది మహతి. ఆర్టిస్టిగ్గా తీర్చిదిద్దిన ఆ బిల్డింగ్ నాలుగువేపులా చూస్తూ లోనికి అడుగుపెట్టారు ఆ ఇద్దరూ.

"ఈయన మధుకర్ మేనమామగారు- నేను ఆయన స్నేహితుడ్ని" రవికిరణ్ చెప్పాడు.

"పేరంట్స్ ఎవరూ లేరా అమ్మా?" మధుకర్ మేనమామ అడిగారు.

"లేరంకుల్ బొంబాయి వెళ్ళారు. రేపొస్తారు" అంటూ మేడ మీదకు దారి తీసింది మహతి.

మేడమీద హాల్లో-

సోఫాలో ఆ ఇద్దరూ కూర్చున్నారు. స్నాక్స్, కూల్‌డ్రింక్స్‌ని టీపాయ్‌మీద పెట్టి ఎదురుగా కుర్చీలో కూర్చుంది మహతి.

“ మధుకర్ మీద నీ ఒపీనియన్‌ని కనుక్కోడానికొచ్చామమ్మా” మేనమామ అన్నాడు.

“ రాఘవేంద్ర నాయుడుగారు పంపించారా మిమ్మల్ని?” నేరుగా మహతి అడిగిన ఆ ప్రశ్నకు మేనమామ, రవికిరణ్ వేపు ఆశ్చర్యంగా చూశాడు.

“అవును!”

“ఫ్రాంక్‌గా చెప్పనా ..... ఐ లైక్ హిమ్ దట్సాల్” ఆ సూటిదనం నచ్చింది మేనమామకు.

“నువ్వు మధుకర్‌ని ఇష్టపడుతుంటే, మధుకర్ కూడా నిన్ను ఇష్టపడుతున్నట్టే గదా ..... ” మేనమామ అడిగాడు.

“ మధుకర్‌ని వెయ్యాల్సిన ప్రశ్న. నన్ను వేస్తున్నారు మీరు” నవ్వుతూ అంది మహతి.

అసలే అందగత్తె! నవ్వినప్పుడు ఇంకా అందంగా వుంటుంది అనుకున్నాడు మేనమామ.

“నువ్వు ఫ్రాంక్‌గా అతన్ని లైక్ చేస్తున్నావని చెప్పావు కాబట్టి, అతన్ని పెళ్ళి చేసుకోడానిక్కూడా నీ కభ్యంతరం వుండదని నేననుకుంటాను. యామై కరెక్ట్?” ఫ్రాంక్, లైక్ పదాల్ని వత్తి పలుకుతూ అన్నాడు మేనమామ.

“నో సర్. నేను లైక్ చేస్తున్నానంటే నేను లవ్ చేస్తున్నానని అర్థం కాదని నా అభిప్రాయం. మ్యేరేజ్ ప్రపోజల్ గురించి మీరడిగారు కాబట్టి నేను చెబుతున్నాను. ఏ ఆడపిల్లయినా హీమాన్ గురించి కలలుకంటుంది. రైట్ మాన్‌ని కోరుకుంటుంది. మధుకర్‌లో ఇంతవరకూ నేను చూసింది హీమాన్‌నే , రైట్‌మాన్‌ని కాదు. మధుకర్‌లో నాకు రైట్‌మాన్ కనిపిస్తే ..... ఆ సమయంలో నేను అలోచించుకుంటాను.”

“నువ్వనుకునే రైట్‌మాన్ అంటే!” ప్రశ్నించాడు మేనమామ.

"కష్టం విలువ తెల్సినవాడు, కష్టపడి పైకి రావాలని కృషి చేసేవాడు, తన వ్యక్తిత్వాన్ని తను నిలుపుకునేవాడు. తనకో వ్యక్తిత్వం వుందని గుర్తించేవాడు" స్పష్టంగా చెప్పింది మహతి.

"నువ్వన్నదాన్ని బట్టి చూస్తే డబ్బున్న వాళ్ళందరూ నీకు శత్రువులు. లేనివాళ్ళందరూ నీకు కష్టం విలువ, వ్యక్తిత్వం విలువ తెల్సిన వాళ్ళు. అంతేనా?" మేనమామ మాటలో వ్యంగ్యం, విసురుని గమనించింది మహతి.

"నో సర్! యూ ఆర్ మిస్టేకెన్! రేపు నేను మధుకర్‌ని కాకపోతే ఇంకో వ్యక్తిని పెళ్ళి చేసుకుంటాను. ఆ వ్యక్తి నాకు భర్తగా వుండడానికి, నేను గుర్తించే అర్హత ఏమిటో తెల్సా? తను కష్టపడి తెచ్చిన డబ్బు ద్వారా ..... నా ఇష్టాల్ని తీర్చాలి. అలాంటి సమయంలో పది రూపాయలు నా అవసరమైనా, ఆ పది రూపాయలూ లేనప్పుడు నేను నా అవసరాన్ని పది పైసలకు  కుదించుకోగలను. నేను రైట్‌మాన్ అయిన నా భర్తకిచ్చే రెస్పెక్ట్ అది. తల్లిదండ్రులు సంపాదించే ఆస్తిని నా కోసం ఖర్చుచేసి, సోమరిగా బతికేవాడిని నేను గౌరవించలేను నిజాన్ని ఒప్పుకోగలిగే ఏ సగటు భారతీయ ఆడపరుచు ఫిలాసఫీ అయినా ఇదే - కాదంటారా చెప్పండి.

మీ కోడలికి పూలు కావాలి- మీ కొడుకు డాడీ, మా ఆవిడకు పూలు కావాలని మిమ్మల్నడిగితే మీకేమనిపిస్తుంది? మీ డబ్బుల్తో కొన్న పూలను పెట్టుకున్న మీ కోడలు, మీ కొడుకునెలా చూస్తుంది? ఒక్కసారి ఊహించుకోండి, అలా మీ కొడుకుండడం మీ కిష్టమేనా చెప్పండి? అలాంటి భర్తను, మీ కోడలు గౌరవిస్తుందంటారా?

బాధ్యత ఎరిగిన మగవాడు, పేదవాడైనా ఫర్వాలేదు-స్త్రీ భరిస్తుంది. బాధ్యత తెలియని మగవాడు బిర్లా అయినా స్త్రీ లెక్క చెయ్యదనే విషయం మీకు నేను చెప్పఖ్కర్లేదనుకుంటాను."

" మధుకర్‌కు బాధ్యత లేదంటావ్ ..... " ఆమె మాటలకు అడ్డొస్తూ అన్నాడు మేనమామ.

"బాధ్యత లేదని నేనడం లేదు ..... బాధ్యత రాలేదని నేనంటున్నాను. అందుకు కారణం అతను కాదు. వాళ్ళ తండ్రిగారు"

ఎస్, షీ ఈజ్ రియల్లీ జీనియస్ అనుకున్నాడు మేనమామ మనసులోనే. ఇలాంటి చేతిలో మధుకర్ పడితే లైఫంటే ఏమిటో వాడికి తెలుస్తుంది అని కూడా అనుకున్నాడాయన.

" రాఘవేంద్ర నాయుడుకి మధుకర్ ఒక్కడే కొడుకు. ఇవాల్టి మనస్తత్వమే రేపు వుంటుందని నేననుకోను" అన్నాడాయన.

"యూ మేబీ కరెక్ట్. కానీ ఇప్పటి మనిషిని అంచనా వేస్తున్నపుడు ఇప్పటి ప్రవర్తననే ఆధారంగా తీసుకుంటాం. డబ్బు రంగుటద్దాల్లోంచి చూసేవాళ్ళకి వాస్తవం రంగుల్లోనే కనబడుతుంది సార్-- ఆ అద్దాల్ని తీసి చూడమనండి -- వాస్తవ జగత్తులో ఎన్ని విచిత్రాలు కనబడతాయో తెలుస్తుంది. రాఘవేంద్ర నాయుడు గారు కష్టపడి సంపాదించినంత మాత్రాన ఆయన కొడుకు కష్టపడకూడదా? ఆ కొడుకు బంగారు పంజరంలోనే వుండాలా? చెప్పండి?

రాఘవేంద్ర నాయుడుగారి ఆస్తెంత వుంటుంది సార్! 500 కోట్లు వుంటుందా? వెయ్యి కోట్లు వుంటుందా? ఒక ఏడాది బిజినెస్ అంతా లాస్ అయిందనుకోండి ..... ఆ లాభాలు నష్టాల్లో పడతాయి. అవునా? కనీసం ఆ బిజినెస్‌నైనా నష్టాల్లోంచి పైకి తీసుకురాగలిగే తెలివితేటలున్నాయా మధుకర్‌కి?" డైరెక్టుగా దాడి ప్రారంభించేసరికి స్టన్అయిపోయాడు మేనమామ.

"కొడుకు చేస్తున్న లక్షల నష్టాన్ని అవలీలగా పూడ్చివేసి, ఆ నష్టాల్ని అమితమైన లాభాలుగా మార్చగలిగే తెలివితేటలు తనకొక్కడికే వున్నాయని ఆయన గర్వపడుతుండొచ్చు. కానీ  ఆయనకు తెలియాల్సిన ఏకైక విషయం, ఆ నష్టాన్ని కొడుకే ఎందుకు భర్తీ చెయ్యడంలేదని? ఆ కెపాసిటీ కొడుక్కి ఎందుకు లేదని? తండ్రులు కోటీశ్వరులుగానూ, కొడుకులు పాపర్లగానూ అయిపోయిన సంఘటనలు చరిత్రలో ఎన్నో వున్నాయి. బిర్లాస్‌ని, టాటాస్‌నీ తీసుకోండి-వాళ్ళ టర్నోవర్‌కన్నా రాఘవేంద్ర నాయుడుగారి టర్నోవర్ గొప్పదా?

బిర్లా మనవళ్ళు ఫోర్తుక్లాస్ ఎంప్లాయిస్‌గా పనిచేసి, అక్కడనుంచి ఒక్కొక్క మెట్టూ ఎక్కి, ప్రతి విషయాన్నీ ప్రాక్టికల్‌గా అబ్జర్వ్‌చేసి ఉన్నత పదవుల్లోకి వస్తారు. ఇది తెలుసా మీకు? అలాంటి బిర్లాల డిసిప్లిన్ మనిషికి అవసరం. అమెరికాలో ఎంత పదవుల్లో ఉన్న ఉద్యోగస్తులైనా, తమ కొడుకులు ఖాళీగా గడపడాన్ని ఇష్టపడరు.

ఏదో ఒక పార్టు టైం జాబ్‌ని చెయ్యమని ఎంకరేజ్ చేస్తారు. అలాకాని పక్షంలో గార్డెనింగ్, డ్రైక్లీనింగ్, వాషింగ్, మార్కెటింగ్, హౌస్‌కీపింగ్ లాంటి ఇంటి పనులను అప్పగించి, వాళ్ళు చేసే పని గంటలకి విలువకట్టి పాకెట్ మనీగా ఇస్తారు. మనలా ఒరేయ్ తీసుకోరా బాబూ ..... అని ఇవ్వరు. జపాన్ అతితక్కువ సమయంలో ప్రపంచదేశాల్ని సాంకేతికంగా శాసిస్తున్న దశకు చేరిందంటే, దానిక్కారణం వింటే మనం ఆశ్చర్యపోతాం.

జపనీస్ ఏకైక స్లోగన్ ఒకటే!

'కొత్త వస్తువును సృష్టించు-కొత్త ప్రయోగాన్ని చెయ్'. చిన్నప్పటినుంచి వాళ్ళ పిల్లలకిచ్చే ట్రైనింగ్ కూడా అదే. నీ మెదడుకి, నీ దేహానికి ఎన్ని గంటలు రెస్టు కావాలో అన్ని గంటలు రెస్ట్ తీసుకో, కానీ అంతకు రెట్టింపు గంటలు పనిచెయ్యి.

ఆ పని - ఫలితాన్నివ్వాలి.

ఏదీ? మన భారతదేశంలో ఆ కాన్సెప్ట్ ఏదీ?

పని చేసేవాడిని వెక్కిరించడం, వ్యక్తిత్వ మున్నవాడిని అగౌరవపరచటం.

రేపటి ప్రపంచం బాగుపడాలంటే ఇవాళ మనిషి కష్టపడాలని చెప్పడంకోసం ఎంతమంది, తమ ప్రాణాల్ని ధారపోసారో గుర్తుకుతెచ్చుకుంటే, వాళ్ళ జీవితాల్లోని సంఘటనలు చదివితే చాలు ఇవాల్టి యువతరంలో సగం నిరాశ పోతుంది."

ఆమె చెప్తున్నదానిని నిశ్శబ్దంగా వింటున్నారు వాళ్ళిద్దరూ. మహతిలోని రేర్ క్వాలిటీస్‌కి, ఆమె వెలిబుచ్చిన అభిప్రాయాలే సాక్ష్యం అనుకున్నాడు మేనమామ.

మహతితో, మధుకర్‌ని బేరీజు వేసుకుంటున్నాడాయన.

" మధుకర్‌ని నువ్వు రిపేర్ చెయ్యగలవు. ఆ పని నువ్వుచేస్తావా?" నెమ్మదిగా అడిగాడాయన.

“నేనేం మెకానిక్‌ను కాను, మధుకర్ పాడయిపోయిన మిషనూ కాదు. అయినా ది గ్రేట్ బిజినెస్ మాగ్నెట్ రాఘవేంద్ర నాయుడుగారే వుండగా మధుకర్‌ని నేను రిపేర్ చెయ్యడం ఏమిటి? ఆయనకు చాతకాదా. ఒక మనిషి బాగుపడటం అన్నది అనుభవాల మధ్యపడి నలిగిపోవటం ద్వారానే సాధ్యమవుతుంది. ప్రక్క మనిషయినా, రచయితయినా ప్రేరణ మాత్రమే ఇవ్వగలరు. లేదంటే చేతకాదని ఆయన్నే నాతో స్వయంగా చెప్పమనండి.”

మేనమామ రవికిరణ్ వేపు చూసాడు.

“ఆయనే నిన్ను స్వయంగా అడిగితే, మధుకర్‌ని పెళ్ళి చేసుకుంటావా?”

చివరి ప్రయత్నంగా అడిగారాయన.

“ మధుకర్ మేనమామగారూ! మరోసారి మీకు స్పష్టంగా చెపుతున్నాను. నాక్కావల్సింది డబ్బున్న ఫాదరిన్లా కాదు- డబ్బు సంపాదించ గల భర్త” దృఢంగ, నిశ్చయంగా అన్న ఆ మాటతో మరేం మాట్లాడలేకపోయాడాయన.

“నేను అనుభవజ్ఞురాలినని చెప్పడంలేదు. కానీ మధుకర్‌లో నిజంగా మార్పు రావాలని రాఘవేంద్ర నాయుడుగారు కోరుకుంటున్న పక్షంలో మధుకర్‌ని ఇంట్లోంచి పంపెయ్యమని చెప్పండి. తన కాళ్ళ మీద తను నిలబడాలని చెప్పమనండి.

చేతిలో పైసా లేకుండా స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదుగుతూ, ఒక్క తరంలో కోట్లాది సంపదను సంపాదించుకోగలిగిన సెల్ఫ్ మేడ్‌మేన్  అని జనం అంటుంటే-- ఆ విధంగా పైకొచ్చిన వ్యక్తి ఎంతటి గొప్ప ఆనందాన్ని, తృప్తిని, గర్వాన్ని అనుభూతిస్తాడో--అలాగే రాఘవేంద్ర నాయుడుగారు కూడా-- నేను చూడకపోయినా, ఆయన్ని ప్రత్యక్షంగా కలిసి పరిశీలించకపోయినా, ఎవరయినా, అలా ప్రెయిజ్ చేస్తే ఆయనా అలాగే అనుభూతిస్తారు. హీ డిజర్వ్స్ ఇట్! ఆయనకా అర్హత వుంది. కాని ఆయన తన కొడుకును మాత్రం కష్టమంటే తెలీకుండా, కంది పోతాడేమో అన్నట్లు పెంచటం పెద్ద తప్పు. రాఘవేంద్ర నాయుడుగారిలాగే జెమ్‌షెడ్జీ తాతా, జి. డి. బిర్లా అనుకుంటే మన దేశం పారిశామికంగా ఇంత ముందంజ వేసేదా? వాళ్ళ తరువాత తరాలుకూడా కష్టపడబట్టే కదా ఈనాడు ఆ సంస్థలు అంతగా ఎదిగాయి. తను కష్టపడాలి. తను సంపాదించాలి. తను ఎదగాలి-- తనను చూసి

అందరూ సెల్ఫ్ మేడ్‌మెన్ అని మెచ్చుకోవాలి. దాన్ని తలుచుకొని తాను ఆనందించాలి. బాగానే వుంది. మరదే ఆనందం, తృప్తి వారి కొడుకైన మధుకర్‌కి దక్కనఖ్కర్లేదా? అదన్యాయం. ఈరోజు రాఘవేంద్ర నాయుడుగారు స్థాపించిన సంస్థల్లో వేలాదిమంది బ్రతుకుతున్నారు.

ఆయనలో జవసత్వాలు వున్నంతవరకు  ఆ వేలాదిమంది కుటుంబాలకు చీకూ చింతా లేదు. ఆ తరువాత తన కొడుక్కేగదా ఆ సంస్థల్ని అప్పగిస్తారు? తను సంపాదించింది గనుక ప్రేమతో తన కొడుక్కి ధారాదత్తం చేస్తారు. వాటిని పెంచి పోషించే ఆత్మబలంలేని తనకొడుక్కి వాటిని అప్పగిస్తారు. బాగానే వుంది. మరా వేలమంది -- వారి కుటుంబాల గతేమవుతుంది? ఆస్థితో పాటు ఆత్మవిశ్వాసాన్ని, క్రమశిక్షణను, శ్రమించగల శక్తినికూడా ఆయన తన కొడుక్కి అందించకపోతే ఆ సంస్థ గతి. ఆ వాటిల్లో పనిచేసే సిబ్బంది గతేమిటి?

Power In the hands of one who did't acquire it. Gradually is often fatal to success. Quick riches are more dangerous than Poverty.

కష్టపడి తండ్రులూ, తాతలూ సంపాదించిన డబ్బును నీళ్ళలా ఖర్చుపెట్టే యువతీ,యువకులకు జీవితం, జీవితంలో విజయాలూ దూరంలో వుంటాయి. ఇది తెల్సుకోమనండి చాలు. తండ్రి ఆస్థిలోంచి, తండ్రి పలుకుబడిలోంచి, తండ్రి గీసిన వలయాలలోంచి బయటికొచ్చిన మరుక్షణం మధుకర్ లైఫ్ బాగుపడుతుందని నా నమ్మకం.'' ఇంతకంటే చెప్పలేనన్నట్టుగా ఆగిపోయింది మహతి.

మేనమామ, రవికిరణ్ వేపు చూశాడు వెళ్దాం అన్నట్టుగా.

``ఓకే అమ్మా! నీ టైంని వేస్టు చెయ్యలేదుకదూ'' అంటూ ఇద్దరూ లేచి గుమ్మంవరకూ వచ్చారు. వాళ్ళిద్దరిలో మేనమామవైపు చూసి నవ్వుకుంది మహతి.